# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 30-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- మహావీర్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు.

- జనగణన-2027 మొదటి విడత వచ్చే నెల 1వ తేదీ నుండి ప్రారంభం కానుంది.

- ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భారతదేశ స్థూల ఆర్థిక వ్యవస్థ పునాదులు పటిష్టంగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

- దేశంలో వచ్చే ఖరీఫ్ సీజన్ కు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

మహావీర్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ పౌరులకు ముఖ్యంగా జైన సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఒక సందేశం విడుదల చేశారు. భగవాన్ మహావీరుని పంచ సూత్రాలైన అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం జీవితంలో సరైన మార్గంలో నడవడానికి మనకు స్ఫూర్తినిస్తాయన్నారు. ఈ సూత్రాలను పాటించడం ద్వారా.. మనం మన జీవితాలను సార్థకం చేసుకోవడంతో పాటూ సమాజంలో సానుకూల మార్పును తీసుకురాగలమని పేర్కొన్నారు. సమాజంలో ప్రబలంగా ఉన్న దురాచారాలకు వ్యతిరేకంగా భగవాన్ మహావీరుడు గళం విప్పి.. మెరుగైన జీవితానికి మార్గాన్ని చూపించారని, ఆయన బోధనలు ఎల్లప్పుడూ సందర్భోచితంగా ఉంటాయని ప్రస్తావించారు. ఈ శుభ సందర్భంలో ఆయన సందేశాలను మన జీవితాలలో స్వీకరించి, దేశ ప్రగతి కోసం నిరంతరం కృషి చేద్దామని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = =

జనగణన-2027 వచ్చే నెల 1వ తేదీ నుండి ప్రారంభం కానుంది. మొదటిసారిగా జనగణనను డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో భారత రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్

కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ జనగణన-2027 గురించి వివరించారు. మొత్తం రెండు విడతలుగా ఈ సారి జనాభా గణన చేపట్టనున్నామని.. అందులో భాగంగా మొదటి విడతలో గృహ గణన నిర్వహిస్తామని చెప్పారు. మొబైల్ యాప్ ద్వారా అధికారులు ఇళ్ల వివరాలు సేకరించనున్నారని తెలిపారు. స్వయంగా వివరాల నమోదు (సెల్ఫ్-ఎన్యూమరేషన్)కు కూడా ప్రభుత్వం ఈ సారి అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఈ జనగణనలో 30 లక్షలకు పైగా  గణనదారులు, పర్యవేక్షకులు, ఇతర అధికారులు పాల్గొంటారని చెప్పారు. జనాభా డేటా భద్రతను నిర్ధారించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయని సెన్సస్ కమిషనర్ వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో సంఘర్షణలు కొనసాగుతున్నప్పటికీ దేశంలో తగినంత ఎరువుల నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది . పశ్చిమ ఆసియాలోని తాజా పరిణామాలపై ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన అంతర్-మంత్రిత్వ సమావేశంలో ఎరువుల శాఖ అదనపు కార్యదర్శి అపర్ణా శర్మ మాట్లాడుతూ, దేశంలోని యూరియా యూనిట్లు ప్రస్తుతం 80 శాతం సామర్థ్యంతో ఉత్పత్తి చేస్తున్నాయని తెలిపారు. యూరియా యూనిట్లకు గ్యాస్ సరఫరా నిరంతరాయంగా కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వచ్చే ఖరీఫ్ సీజన్ కు 390 టన్నుల ఎరువులు అవసరమని చెప్పారు. ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా ఎరువుల సరఫరాకు ప్రత్యామ్నాయ దేశాల నుండి ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎరువుల దిగుమతికి, యూరియా దేశీయ ఉత్పత్తికి కీలకమైన గల్ఫ్ ప్రాంతం ప్రభావితమవుతున్నప్పటికీ వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సరిపడా నిల్వలు దేశంలో అందుబాటులో ఉన్నాయని రైతులకు మునుపటి ధరలకే ఎరువుల సరఫరా జరుగుతుందని హామీ ఇచ్చారు. ఇక పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ.... దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి, పిఎన్‌జి నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. చమురు నిల్వల లభ్యతను నిర్ధారించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటూనే ఉందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో నక్సల్ కార్యకలాపాలు, మావోయిస్టుల ఉనికి ఎక్కువగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో సైతం నక్సలిజం దాదాపు అంతమైందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. లోకసభలో `నక్సల్ రహిత భారత్` అంశంపై ఆయన ఈరోజు సుదీర్ఘ ప్రసంగం చేశారు. పేదరికం వల్ల నక్సలిజం విస్తరించలేదని, వామపక్ష తీవ్రవాదం అనేక గిరిజన ప్రాంతాలను ఏళ్ల తరబడి పేదరికంలో ఉంచిందని పేర్కొన్నారు. వామపక్షవాదులు తమ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి అమాయక గిరిజనులను తప్పుదోవ పట్టించారని వ్యాఖ్యానించారు. మావోయిస్టులు సమాంతర ప్రభుత్వాన్ని నడిపారని, అభివృద్ధి పనులను అడ్డుకున్నారని, ప్రజలను ఓటు వేయకుండా నిరోధించారని చెప్పారు. సమాజంలోని అన్యాయాలకు పరిష్కార మార్గాలు రాజ్యాంగంలో ఉన్నాయని.. ఆయుధాలు చేపట్టడం సరైన మార్గం కాదని ఉద్ఘాటించారు. చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని  అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భారతదేశ స్థూల ఆర్థిక వ్యవస్థ పునాదులు పటిష్టంగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. రూపాయి మారకం విలువ ప్రపంచ విపణిపై ఆధారపడి ఉంటుందని ఉద్ఘాటించారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో రూపాయి విలువ క్షీణించడంపై మంత్రి ఈరోజు సమాధానమిస్తూ.. భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయని, ప్రపంచ అనిశ్చితి కారణంగా కరెన్సీలన్నీ అస్థిరతను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. భారతదేశంలో మాత్రం ద్రవ్యోల్బణం కనిష్ట

స్థాయికి తగ్గిందని, జీడీపీ వృద్ధి 7 శాతానికి పైగా కొనసాగుతోందని మంత్రి పలు కీలక ఆర్థిక సూచికలను ఉటంకించారు. అధిక డాలర్ల తరలింపులతో సహా ప్రపంచవ్యాప్త అస్థిరత కరెన్సీలను ప్రభావితం చేస్తోందని, మారకపు రేటు ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న దేశం భారత్ మాత్రమే కాదని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

నమో యాప్ ద్వారా అసోం, పుదుచ్చేరి బీజేపీ కార్యకర్తలనుద్దేశించి 'మేరా బూత్ సబ్సే మజ్బూత్' సంవాద్ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. గత దశాబ్ద కాలంలో అస్సాం సాధించిన ప్రగతి అందరికీ కనబడుతోందని, అన్ని రంగాలలోనూ అసోం అభివృద్ధి పథంలో పయనిస్తోందని చెప్పారు. అదే విధంగా గత 5 సంవత్సరాలుగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పుదుచ్చేరి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు గుజరాత్‌లో పర్యటించనున్నారు. మహావీర్ జయంతి సందర్భంగా.. గాంధీనగర్‌లోని కోబా తీర్థంలో సమ్రాట్ సంప్రతి మ్యూజియాన్ని ప్రధానమంత్రి ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. అదే విధంగా మధ్యాహ్నం అహ్మదాబాద్‌లోని సనంద్‌లో `కేన్స్ సెమికాన్ ప్లాంట్`ను ప్రారంభించి.. బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం ప్రధానమంత్రి వావ్-థరద్‌కు పయనమవుతారు. అక్కడ 20 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 73 వేల 583 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 1,636 పాయింట్ల నష్టంతో 71 వేల 947 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 488 పాయింట్లు నష్టపోయి 22 వేల 331 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94 రూపాయల 94 పైసలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =